క్లుప్తంగా

అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పట్టణానికి చెందిన నవ్వుల రారాజులు ఫేస్‌బుక్ సభ్యులు, గ్రూపు అడ్మిన్ల సహకారంతో వృద్ధులు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ మాట్లాడారు. ఉగాది పర్వదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి భాస్కర్‌రావు, కోదాడ మండలం ఖానాపురం సర్పంచ్ శ్రీనివాసరావు, పర్వతనేని ఉపేందర్, ఈవీఆర్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

హన్మంతమ్మ మృతికి సంతాపం



హన్మంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్, నాయకులు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకురాలు కాంపాటి హన్మంతమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె మృతికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు నంధ్యాల రామిరెడ్డి, కాంపాంటి వెంకటయ్య, రెమిడాల రాజు, రమేష్, రంగారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. హన్మంతమ్మ మృతి పార్టీకి తీరనిలోటు అని అన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



ఆలయ నిర్మాణం కోసం పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులను బుధవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ఆలయం పురాతనమైనది కావడంతో ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మాణ పనుల కోసం మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ల సహకారంతో దేవాదాయ శాఖ నుంచి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టబోయే పనుల్లోత భాగంగా నిర్మాణ పనుల కోసం మట్టి నమూనా సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ కొంపెల్లి సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి గుర్వయ్య దంపతులు, ఎంపీటీసీ గన్నా భవానీ, పలువురు గ్రామపెద్దలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అమర్ గౌడ్ అన్నారు. పట్టణంలోని గోవిందపురంలో మంగళవారం రాత్రి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ సైనికుడిలా పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సౌజన్య ధనుంజయ్, నాయకులు పి.రాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఉగాది సంబరాలు

- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పంచాంగ పఠనం చేసిన అర్చకులు
- గ్రామాల్లో ఉగాది పచ్చడిని పంపిణీ చేసిన నాయకులు



నడిగూడెంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



నేరేడుచర్ల శివాలయంలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్న పురోహితుడు వెంకటేశ్వరశాస్త్రి

మునగాల : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తమ ఇళ్లల్లో ఉగాది పచ్చడిని తయారు చేసుకొని బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవెంకటకనకదుర్గ దేవాలయంలో పూజారులు వారణాసి వెంకటరమణశాస్త్రి, వారణాసి మధుశర్మల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయంలో అర్చకుడు నరపనేని రామారావు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అదేవిధంగా రామాలయంలో పూజారులు పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, రెడ్డి జన సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో బుధవారం ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయాల్లో ఆలయ పూజారులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

నేరేడుచర్ల : ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టుకొని ఉగాది పచ్చడి చేసి పచ్చడను స్వీకరించి ఒకరికొకరూ ఉగాది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం సాయంత్రం దేవాలయాలలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో నేరేడుచర్ల శివాలయం ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వర్‌రావు, సోమప్ప దేవాలయ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, ఆకారపు వెంకటేశ్వర్లు, వెంకటరమణారావు భక్తులు తదితరులున్నారు.

హుజూర్‌నగర్ : శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను పట్టణంలోని పలు ఆలయాల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం ఆలయాల ప్రాంగణంలో పంచాంగ శ్రవణం గావించారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ శోభకృత్ తెలుగు నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం, కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సర్పంచ్ షేక్ సలీమారంజాన్, ఉపసర్పంచ్ శీలం ఆదేమ్మ, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గువ్వల వీరయ్య, షేక్ అలీపాషా, ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, లింగయ్య, కిరణ్‌గౌడ్, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి, పొనుగోడు, కితవారిగూడెం, గడ్డిపల్లిలోని శివాలయాలు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పూజారులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, మహిళలు తదితరులున్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే నడిగూడెం, సిరిపురం శ్రీ కోదండరామస్వామి ఆలయాల్లో పంచాంగం శ్రవణం చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆలయాల ప్రధాన అర్చకులు ఎస్‌బీ.వరదాచార్యులు, వేదాంతం చక్రధరాచార్యులు, నడిగూడెం ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, భక్తులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాలతో పాటు ప్రజలు తమ ఇళ్లలో పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణాన్ని విన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని కనకదుర్గా దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా చౌటపల్లిలోని శ్రీవేణు గోపాలస్వామి దేవాలయంలో, బక్కమంతులగూడెం రామాలయంలో, రఘునాథపాలెంలోని కోదండరామస్వామి దేవాలయంలో, యాతవాకిల్ల, అల్లీపురం వరదాపురం, గుండ్లపల్లి, పెదవీడు తదితర గ్రామాల్లోని ఆలయాలలో పంచాంగ శ్రవణం పఠనం గావించారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు కొండా నాయక్, కె.లక్ష్మీవెంకటనారాయణ, మల్లికంటి బుచ్చయ్య, రవీందర్, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటికి మామిడి ఆకుల తోరణాలతో అలంకరించి షడ్ రుచులతో తేనీటి పానకం తయారు చేసి ఇంటిల్లిపాది స్వీకరించారు.



మునగాల రామాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు



మఠంపల్లి : పంచాంగ పఠనంలో పాల్గొన్న భక్తులు



హుజూర్‌నగర్ : నరసింహస్వామి ఆలయంలో..



మేళ్లచెరువులో పాల్గొన్న భక్తులు



గరిడేపల్లిలో పంచాంగం వింటున్న గ్రామస్తులు



హుజూర్‌నగర్‌రూరల్‌లో..

శ్రీ శోభకృత్‌లో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- టీటీడీ నుంచి తెప్పించిన ప్రత్యేక పంచాంగాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లం

కోదాడఅర్బన్ : శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆకాంక్షించారు. బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఆయన పట్టణంలోని జీర్ణోద్ధరణ జరుగుతున్న శ్రీ కోదండరామాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని అనంతగిరి రోడ్డులో ఉన్న శ్రీ గుంటి రఘునాథ స్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన సతీమణి ఇందిరాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో పూజల అనంతరం పట్టణానికి చెందిన బ్రహ్మశ్రీ వేదపండితులు వావిలాల లక్ష్మీనారాయణశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, సుశర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ గుంటి రఘునాథస్వామి ఆలయంలో తిరుపతి నుంచి తెప్పించిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంచాంగ శ్రవణం ఒక పుణ్య కార్యక్రమం అని, రాబోయే సంవత్సరం ఏమి జరుగుతుందో తెలిపే జ్ఞానదిగ్సూచి అని అన్నారు. సంవత్సర కాలం ప్రజలు ఏవిధంగా ఉండాలని, శుభకార్యాలు, విపత్తులు, వాటిని ఏవిధంగా ఏదుర్కొవాలో తెలిపేదే మన పంచాంగం అని అన్నారు. ప్రజలు సుభిక్షంగా, అష్ట ఐశ్వరాలు, ఆర్థికాభివృద్ధి, పశు సంపద, పంటలు పెరిగి రైతలు సిరి సంపదలతో ఆర్థికాభివృద్ధిలో బలపడాలని ఆయన ఆకాంక్షించారు. కాగా గుంటి రఘునాథస్వామి ఆలంయలో ఆలయ చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంపటి పద్మ, పట్టణానికి చెందిన ప్రముఖులు పి.సత్యబాబు, యర్రా శ్రీనివాసరావు, పి.నారాయణరావు, ప్రసాద్‌రెడ్డి, ప్రకాష్, ఈదుల కృష్ణయ్య, కల్లూరి పద్మజ, రంగారావు, నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంగనిగుడిలో మాజీ ఎమ్మెల్యే పద్మావతి పూజలు..

కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక అనంతగిరి రోడ్డులో ఉన్న శ్రీగుంటి రఘునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. గుంటి రఘునాథస్వామి ఆలయ చైర్మన్ రంగయ్య పద్మావతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కోదాడఅర్బన్ : పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే



హుజూర్‌నగర్ రామాలయంలో..



చిలుకూరు అభయాంజనేయస్వామి ఆలయంలో

జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : పట్టణంలో ఈనెల 25న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే యాత్ర

పెన్‌పహాడ్: మతోన్మాద బీజేపీ పాలనలో కనుమరుగవుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసమే జనచైతన్య యాత్ర సీపీఎం ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం భక్తాళాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన చైతన్య యాత్ర ఈ నెల 25, 26 తేదీల్లో కోదాడ నుంచి హుజూర్‌నగర్, నేరేడుచర్ల మీదుగా మిర్యాలగూడేనికి చేరుకుటుందని అన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా సీపీఎం చేస్తున్న పోరాటాలకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు అడివయ్య, పీరయ్య, గోపయ్య, రమేష్, చిరు, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ



చిలకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కొండేటి రజిని మామ కొండేటి చిలకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, మామిడి అంజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాం రెడ్డి, సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణం కోసమే కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ చేస్తున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటు చేయడం కోసమే పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ నాగభూషణం అన్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం తెల్లవారుజామున పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. గ్రామంలో సరైన కాగితాలు లేని 33ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, సీఐలు సోమ నారాయణసింగ్, రాజశేఖర్, ఎస్ఐలు ఉన్నారు.

కవి సమ్మేళనాలతో కవులకు ప్రోత్సాహం



శ్రీరంగనిగుడిలో ఉగాది కవి సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటేశ్వర్లు

కోదాడఅర్బన్ : కవి సమ్మేళనాలతో కవులకు ప్రోత్సాహం లభిస్తుందని, అదే విధంగా కవులల్లో ఉన్న ప్రతిభపాటవాలు వెల్లువెత్తుతాయని ప్రముఖ సాహితి వేత్తలు, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, మంత్రిప్రగఢ భరతరావు అన్నారు. బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని అనంతగిరి రోడ్డులో గల శ్రీగుంటి రఘునాథస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనాన్ని వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతిలో కవులకు, సాహితీవేత్తలకు గుర్తింపు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కవి సమ్మేళనాలు సాహిత్య అభిరుచికి ప్రతీకలని, ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా కవి సమ్మేళం నిర్వహిస్తూ కవులను ప్రోత్సహిస్తున్న శ్రీ గుంటి రఘునాథస్వామి ఆలయ కమిటీ వారు అభినందనీయులన్నారు. కాగా ఈ కవి సమ్మేళనంలో 40మంది కవులు పాల్గొని పలు సామాజిక, ఆధ్యాత్మిక, సాహిత్య అంశాలపై కవితలు రాసి చదివి వినిపించారు. అనంతరం కవులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రచయిత సిరికొండ రాజు రచించిన వర్ణాలు లేని వ్యాక్యాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉగాది కవి సమ్మేళనం కన్వీనర్ ఎస్ఎస్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, అనువంశిక ధర్మకర్త గుడుగుంట్ల రంగయ్య, ఎక్సైజ్ అధికారి ఉప్పేల సోమిరెడ్డి, కోదాడ రచయితల సంఘం అధ్యక్షుడు పుప్పాల కృష్ణమూర్తి, నర్సింహారావు, ధర్మకర్తల మండలి సభ్యులు వేనేపల్లి శ్రీనివాసరా వు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొమరగిరి రంగారావు, కాటేపల్లి నర్సింహారావు, గెల్లా లక్ష్మీనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల రాఘవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా కొమరబండ మేజర్‌కాల్వ

- దెబ్బతిన్న లైనింగ్
- కాల్వలో పేరుకుపోయిన నాచు
- దట్టంగా పెరిగిన కంపచెట్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తెల్లబల్లి వద్ద దెబ్బతిన్న లైనింగ్



తెల్లబల్లి వద్ద కాల్వలో పెరిగిన జమ్ము



రామాపురం వద్ద కాల్వలో పెరిగిన నాచు



రామాపురం వద్ద మైనర్ కాల్వలో పెరిగిన కంపచెట్లు

నడిగూడెం : నాగార్జునసాగర్ కాల్వకు అనుబంధంగా ఉన్న మండలంలోని కొమరబండ మేజర్‌కాల్వ అధ్వానంగా మారింది. ఈ కాల్వ కట్టలు బలహీనంగా మారడంతో నిత్యం గండ్లు పడుతున్నాయి. దీంతో ప్రతి ఏడాది లక్షల రూపాయల వ్యయంతో ఆధునీకరణ పనులు చేస్తున్నా ఫలితం ఉండడంలేదని రైతులు వాపోతున్నారు. రామాపురం వద్ద ఉన్న ఈ కొమరబండ మేజర్‌కాల్వ పరిధిలోని రామాపురం, చాకిరాల, ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎఖ్లాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబెల్లి, కోదాడ మండలం కొమరబండ గ్రామాలున్నాయి. ఈ కాల్వ పరిధిలో దాదాపు ఎనిమిది వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. కాల్వలో కంపచెట్లు, లైనింగ్ దెబ్బతినడంతో పాటు, పలు చోట్ల పూడి పోవడంతో చివరి భూములకు నీరందడంలేదు. ప్రధానంగా రామాపురం వద్ద కాల్వ కట్ట బలహీనంగా ఉండడంతో నిత్యం అక్కడ గండ్లు పడుతున్నాయి. రామాపురం, ఎక్లాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి వద్ద కంపచెట్లు దట్టంగా పెరిగాయి. ఇక మైనర్ కాల్వలు పూడిపోయి అధ్వానంగా ఉన్నాయి. ప్రతి సీజన్‌లో చివరి భూములకు నీరందకపోవడంతో చేతికొచ్చే దశలో పొలాలు ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు.

నాసిరకంగా పనులు.. కూలిపోతున్న లైనింగ్

ఈ కొమరబండ మేజరు కాల్వ ఆధునీకరణ పనుల్లో భాగంగా ప్రతి ఏడాది రూ.లక్షలతో కాల్వకట్ట పనులు, లైనింగ్, కంపచెట్ల తొలగింపు తదితర పనులు నాసిరకంగా చేస్తుండడంతో, అటూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ఆ గ్రామాలకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వకు మరమ్మతులు చేసి, వచ్చే సీజన్‌లో చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చివరి భూములకు నీరందడంలేదు



మా గ్రామ సమీపాన ఉన్న కొమరబండ మేజరు కాల్వ, మైనరు కాల్వలు అధ్వాన్నంగా మారాయి. పలు చోట్ల పూడిపోయాయి. దీంతో చివరి భూములకు నీరందడంలేదు. ఈ కాల్వ కింద ఎకరంనర పొలం ఉంది. సీజన్ ముగింపు సమయంలో నీరందక ఇబ్బందులు పడుతున్నాము.

– వీరబోయిన నాగయ్య, రైతు తెల్లబల్లి


పూర్తి స్థాయి మరమ్మతులు చేయాలి



కొమరబండ మేజరు కాల్వలో పలు చోట్ల కంపచెట్లు దట్టంగా పెరిగాయి. హై లెవెల్ కాల్వ మరీ అధ్వానంగా కంపచెట్లు పెరగడం, కాల్వ పలు చోట్ల పూడిపోవడంతో నీరందడంలేదు. అనేక చోట్లలో లైనింగ్ దెబ్బతింది. దీంతో సాగునీరు సరిపడా అందడంలేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షించి, ఆధునీకరణ పనుల్లో భాగంగా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.

– ఏనుగుల కోటేశ్వరరావు రైతు, రామాపురం

సత్యనారాయణ మృతి.. సంఘానికి తీరనిలోటు



ఈదర సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కోదాడఅర్బన్ : టీఎస్ యూటీఎఫ్ సీనియర్ సభ్యుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి రిటైర్డ్ హెచ్‌ఎం ఈదర సత్యనారాయణ మృతి సంఘానికి తీరని లోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన ఈదర సత్యనారాయణ(72) బుధవారం ఉదయం గుండెపోటుతో ఆయన స్వగృహంలో మృతి చెందారు. దీంతో ఆయన పార్థీవ దేహాన్ని ఎమ్మెల్సీ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై జరిగిన పోరాటాల్లో ఈదర సత్యనారాయణ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈదర ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. నివాళులర్పించిన వారిలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ధనమూర్తి, మాజీ కార్యవర్గ సభ్యురాలు కేఏ మంగ, సీనియర్ నాయకులు సనత్‌కుమార్, గడ్డం వెంకటరెడ్డి, చందూరు ప్రసాదరావు, సుబ్బారావు, హమీద్, వీరారెడ్డి ఉన్నారు. కాగా ఈదర సత్యనారాయణ మృతదేహాన్ని కోదాడ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, పలువురు విశ్రాంత ఉద్యోగులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.